

విజయనగరంలో సిరిమాను ఊరేగింపు



అమ్మా..
పైడిమాంబ..
జైజై పైడితల్లి..
ఎవరి నోట విన్నా.. అదే స్మరణ.. పెదతాడివాడ నుంచి విజయనగరం వరకు సిరిమాను తీసుకొచ్చే దారులన్నీ భక్తజన జాతరే.
పల్లెలన్నీ పులకింతే.

కదిలొచ్చె పైడితల్లి.. భక్తులు ప్రణమిల్లి

చెట్టుకు గొడ్డలితో గాట్లు పెడుతున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మీసింధు, పూజారి వెంకటరావు తదితరులు



వృక్షాన్ని భూదేవి నుంచి వేరు చేసిన ప్రాంతంలో భక్తుల సందడి

విజయనగరం కంటోన్మెంట్/డెంకాడ, న్యూస్‌టుడే: పైడితల్లి జాతరలో ప్రధాన ఘట్టం సిరిమాను సంబరం. ఉత్సవం నాడు లక్షల మంది భక్తులు విచ్చేస్తారు. మహిమాన్వితమైన సిరిమాను, ఇరుసుమాను వృక్షాలు ఈ ఏడాది డెంకాడ మండలం పెదతాడివాడలో మజ్జి అప్పారావు కల్లంలో సాక్షాత్కరించాయి. శనివారం ఉదయం పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాదరావు, పైడిమాంబ దీక్షాధారులు, భక్తులు వృక్షానికి పసుపు, కుంకుమలు సమర్పించి దీపారాధనలతో అఖండ అర్చనలు నిర్వహించారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తానికి వేదపండితులు తాతా రాజేష్, సాయికిరణ్‌శర్మ, అచ్యుత నాగేంద్రశర్మ, దూసి కృష్ణమూర్తిలు మంత్రాలు, నీలయ్య, వెంకటరమణ నాదస్వరాల నడుమ గొడ్డళ్లతో గాట్లు పెట్టి మానుగా మలిచే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టారు. అక్కడే సాక్షాత్కారమైన ఇరుసుమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పారవశ్యంతో చేసిన జై పైడిమాంబ స్మరణతో ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది. శాసనసభ్యులు పూసపాటి అదితి గజపతిరాజు, లోకం మాధవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జడ్పీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ అధ్యక్షుడు కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సతీమణి లక్ష్మీసింధు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, వృక్షం యజమాని కుటుంబ సభ్యులు పాల్గొని గాట్లు పెట్టారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ 2017లో తెదేపా ప్రభుత్వమే పైడితల్లి ఉత్సవాలను రాష్ట్ర పండగగా ప్రకటించిందని, అనంతరం వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర పండగగా చేస్తున్నామని.. భక్తులు, విజయనగరం ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ ఈ ఏడాది తల్లి సిరిమాను వృక్షాలు నియోజకవర్గంలో గుర్తించడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ సందర్భంగా చెట్టు యజమాని మజ్జి అప్పారావు 2,000 మందికి, గ్రామ పెద్దలు 10,000 మందికి అన్నదానం చేశారు.

రామతీర్థంలో ప్రాయశ్చిత్త హోమం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: తితిదే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో రామతీర్థంలో శ్రీరామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రాయశ్చిత్త మహాశాంతి హోమం నిర్వహించారు. ఇక్కడి కల్యాణ మండపంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, నాయకులు సువ్వాడ రవిశేఖర్, చిన్నంనాయుడు, ఆనంద్‌కుమార్, రాజారావు, చంద్రశేఖర్, ఈవో వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న ఎంపీ కలిశెట్టి, కర్రోతు, మాధవి

యువ.. జోష్



ఆకట్టుకున్న ప్రదర్శన

విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయనగరంలో నిర్వహించిన భగత్‌సింగ్ ఫెస్ట్ యువతలో జోష్ నింపింది. భగత్‌సింగ్, గాంధీ స్ఫూర్తితో మెరుగైన సమాజానికి కృషి చేయాలని, మహాకవి గురజాడ బాటలో యువత ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు.

మర్యాదపూర్వక కలయిక



జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛమందిస్తున్న కలెక్టర్

జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని శనివారం కలెక్టరు బి.ఆర్.అంబేడ్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జి బి. సాయి కళ్యాణచక్రవర్తి ఉన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

సీఐలు, ఎస్సైల బదిలీ

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: విశాఖపట్నం రేంజ్ పరిధిలో పలువురు సీఐలు, ఎస్సైలను బదిలీ చేస్తూ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు బదిలీ అయ్యారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
బి. లక్ష్మణరావు	వీఆర్, విశాఖ	విజయనగరం గ్రామీణం
కె. వైకుంఠరావు	వీఆర్, విశాఖ	పీసీఆర్, విజయనగరం
ఎల్. అప్పలనాయుడు	వీఆర్, విశాఖ	సోషల్ మీడియా, సైబర్ సెల్
ఎం. శ్రీనివాసరావు	వీఆర్, విశాఖ	వీఆర్, పార్వతీపురం మన్యం
జి. దేముడుబాబు	సోషల్ మీడియా పార్వతీపురం	డీఎస్‌బీ పార్వతీపురం
ఎ. ప్రసాద్‌రావు	వీఆర్, విశాఖ	డీటీసీ, పార్వతీపురం
టి. కాంతికుమార్	వీఆర్, విశాఖ	కొరియా, పార్వతీపురం
ఎస్సై పేరు	**ప్రస్తుతం**	**బదిలీ ప్రాంతం**
పి. నారాయణరావు	వీఆర్, పీవీపీ	కురుపాం పీఎస్
ఎన్. ప్రశాంత్‌కుమార్	వీఆర్, పీవీపీ	జియ్యమ్మవలస
పి. అనిష్	జియ్యమ్మవలస	చినమేరంగి
వై. అమ్మన్నరావు	వీఆర్, పీవీపీ	సీతంపేట
ఎం. జగదీష్‌నాయుడు	సీతంపేట	ఎస్ఐ-2, సాలూరు
ఎస్‌కే. ఫక్రుద్దీన్	వీఆర్, పీవీపీ	దిశ, పార్వతీపురం
ఎం. పాపయ్య	వీఆర్, పీవీపీ	ట్రాఫిక్, పార్వతీపురం
ఎన్. శంకరరావు	వీఆర్, పీవీపీ	డీఎస్‌బీ, పార్వతీపురం
ఎం. మోహనరావు	వీఆర్, పీవీపీ	పీసీఆర్, పార్వతీపురం
బి. దేముడు	వీఆర్, పీవీపీ	డీఎస్‌బీ, పార్వతీపురం
వై. సురేష్	వీఆర్, పీవీపీ	దిశ, పార్వతీపురం
జి. అప్పారావు	వీఆర్, పీవీపీ	దిశ, పార్వతీపురం
పి. సత్యనారాయణ	వీఆర్, పీవీపీ	సీసీఎస్, పార్వతీపురం
జీవీ రమణ	వీఆర్, పీవీపీ	దిశ, పార్వతీపురం
డబ్ల్యూ. మణిబాబు	వీఆర్, పీవీపీ	దిశ, పార్వతీపురం
ఎస్‌కే. మస్తాన్	వీఆర్, పీవీపీ	దోనుభాయి

రైలు ప్రయాణంలో ఆగిన వృద్ధుడి గుండె

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి చెందారు. జీఆర్‌పీ ఎస్సై అరుణకుమారి కథనం మేరకు.. . విజయనగరం వీటీ అగ్రహారానికి చెందిన మూలా నాగేశ్వరరావు (70) భార్యతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రైల్లోనే గుండెపోటుతో మృతిచెందారు.

వరద బాధితులకు రూ.4.89 లక్షల విరాళం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం దాతలు అందించిన విరాళాల మొత్తం రూ. 4.89 లక్షల చెక్కును ఎమ్మెల్యే అదితి గజపతి రాజు శనివారం కలెక్టర్ డా. బి. ఆర్. అంబేడ్కర్‌కు అందజేశారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

పెరిగిన కార్మికుల వేతనాలు

విజయనగరం అర్బన్, కోట, న్యూస్‌టుడే: జిల్లాలో దినసరి కార్మికుల వేతనాలు పెరిగాయి. గతేడాది కంటే 10.12 శాతాన్ని పెంచుతూ జిల్లాస్థాయి వేతనాల కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల నియంత్రణ, పాక్షిక నియంత్రణలో పని చేసే ఎన్ఎంఆర్, రోజువారీ కార్మికులకు ఇది వర్తిస్తుంది. పెంచిన వేతనాలు 2025 జూన్ 30 వరకు అమలవుతాయని కలెక్టర్ డా. బి. ఆర్. అంబేడ్కర్ తెలిపారు. శనివారం తన ఛాంబర్లో కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రణాళిక అధికారి పి. బాలాజీ, కార్మికశాఖ ఉప కమిషనర్ ఎన్. సుబ్రహ్మణ్యం, ఆర్అండ్‌బీ ఈఈ ఎం. జేమ్స్ పాల్గొన్నారు.

రోజుకు వేతనం.. (రూ.లో)

కార్మికులు	అర్బన్	గ్రామీణం
నిపుణ కార్మికులు	700	680
నైపుణ్యం లేనివారు	485	465
కొంత నైపుణ్యం	590	560
ఎక్కువ నైపుణ్యం	910	850

ప్రతి ఇంట్లో సౌర విద్యుత్తు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి ఇంట్లో సౌర విద్యుత్తు వినియోగించుకునేలా చైతన్యపర్చాలని జేసీ సేధుమాధవన్ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ యోజనపై శనివారం అధికారులతో సమీక్షించారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.




సమీక్షిస్తున్న సంయుక్త కలెక్టర్ సేధుమాధవన్

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

రామాయణం.. విలువల పెద్దబాలశిక్ష



సదస్సులో వైదేహి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: రామనారాయణంలో శ్రీరామాయణ శంఖారావం సదస్సు రెండో రోజు ఆద్యంతం భక్తిపారవశ్యాన్ని నింపింది. పలువురు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు తమ ప్రసంగంతో రామాయణ ప్రామాణికతను పెంచేలా సదస్సుకు నిండుదనం తెచ్చారు. ధర్మం, విలువలు, యజ్ఞాలు, రామరాజ్యం తదితర అంశాలను అధర్వణ వేద విద్వాంసులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, కృష్ణమూర్తి, ఉలిమిరి వెంకట సోమయాజులు వివరించారు. రామాయణం విలువలతో కూడిన పెద్దబాలశిక్షగా అభివర్ణించారు. ఈ సందర్భంగా వైదేహి రచించిన 'వైదేహి' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. పలువురు వక్తలను నారాయణం ట్రస్ట్ నిర్వాహకులు సత్కరించి గౌరవించారు.

రేబిస్ వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: పెంపుడు జంతువుల నుంచి జంతు ప్రేమికులు, సంరక్షకులకు రేబిస్ వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వై.వి. రమణ సూచించారు. స్థానిక బహుళార్థక పశువైద్యశాలలో శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి రేబిస్, మెదడు వాపు, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. డీడీ జి. మహాలక్ష్మి, ఏడీ కె.వి. రమణ, రాంప్రసాద్, ధర్మారావు, చక్రవర్తి, కన్నంనాయుడు, వేణుమాధవ్, పశువైద్యులు మోహన్, పారా వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమణ

నాడీ వ్యవస్థపై ప్రభావం

విజయనగరం రింగురోడ్డు: రేబిస్ వ్యాధి నాడీ వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపుతుందని డీఎంహెచ్‌వో ఎస్. భాస్కరరావు అన్నారు. రేబిస్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ శనివారం తన కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు.

కోరుకొండ సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం కోరుకొండ సైనిక్ స్కూల్ 1967-1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థి దశలోని తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ప్రిన్సిపల్ కెప్టెన్ ఎస్.ఎస్. శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏయే వృత్తుల్లో స్థిరపడ్డారు, సాధించిన విజయాలను వేదికపై పంచుకున్నారు.



1967-1974 బ్యాచ్ విద్యార్థులు

ఈ బ్యాచ్‌కు చెందిన 15 మంది సాయుధ దళాల్లో అధికారులుగా సేవలందించారు. ప్రస్తుత విద్యార్థులతో మాట్లాడుతూ దేశానికి సేవలందించాలని సూచించారు. పాఠశాల మొత్తం కలియతిరిగారు.

భగత్‌సింగ్, గాంధీ స్ఫూర్తితో..

- ఎస్ఎఫ్ఐ ఫెస్ట్‌లో వక్తల పిలుపు

మెరుగైన సమాజానికి నాంది

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: యువతకు మాదకద్రవ్యాల వల్ల వచ్చే ఆనందం కంటే విద్య, విజ్ఞానంతో ఎన్నో రెట్లు అధికంగా కలుగుతుందని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ ఫెస్ట్‌లో వక్తలు ఉద్ఘాటించారు. గురజాడ కళాభారతిలో శనివారం నిర్వహించిన ఫెస్ట్.. యువతలో స్ఫూర్తిని రగిల్చింది.



నగరంలో విద్యార్థుల ప్రదర్శన

జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ కూడలి మీదుగా గురజాడ కళాభారతి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో గాంధీ, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సామాజిక బాధ్యత

యువతకు మత్తు పదార్థాల వల్ల వచ్చే అనర్థాలను చాటి చెప్పేందుకు సామాజిక బాధ్యతగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామ్మోహన్ అన్నారు. మూడు రోజులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించామన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు పావని మాట్లాడుతూ యువత ఎక్కువగా గంజాయికి బానిసవుతున్నారని, మహిళలు సైతం మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి. రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాహితి స్రవంతి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్, జిల్లా కార్యదర్శి సీహెచ్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఫెస్ట్‌లో సారా తాగడంతో వచ్చే అనర్థాలపై గాయకుడు తిరుపతిరావు పాట పాడగా.. బొబ్బిలికి చెందిన విద్యార్థిని సృజన నాన్‌చాక్‌తో ఆత్మరక్షణ విద్యను ప్రదర్శించింది. ఎస్. కోట నుంచి వచ్చిన విద్యార్థిని సినిమా పాటకు నృత్యరూపాన్నిచ్చింది.



సదస్సులో ఎస్ఎఫ్ఐ నాయకుల సంఘీభావం

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

బొబ్బిలి


● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

పరిహారం చెల్లించండి

రాజాం, న్యూస్‌టుడే: రహదారుల విస్తరణలో ఆస్తులు కోల్పోతున్నామని, పరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. శనివారం రాజాం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో పుర కమిషనర్ రామ అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తమ సమస్యలు వివరించారు. టీడీఆర్ బాండ్లు బదులు నగదు చెల్లించాలని పలువురు కోరారు. మున్సిపాల్టీల్లో నగదు చెల్లింపులు చేసే పరిస్థితి లేదని, టీడీఆర్ బాండ్లు జారీ చేసే విధానం అమల్లో ఉందని కమిషనర్ వివరించారు. నగదు కంటే బాండ్లే మేలని, వీటిని బదిలీ చేసుకునేందుకు వీలుందన్నారు. భవన యజమానులు తమ డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను అందిస్తే బాండ్లు జారీ చేసేందుకు అవసరమైన ప్రక్రియ చేపడతామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తూట్లు

మండలంలోని గడ్డిముడిదాంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రం భవనం బీటలు వారింది. ఇది ప్రారంభమై ఏడాది కాకముందే బీటలు ఏర్పడటం గమనార్హం. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు తెలియజేసి మరమ్మతులు చేపడతామన్నారు.- న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం



దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, న్యూస్‌టుడే: సేవా దృక్పథంతో పారావాలంటీర్లుగా పనిచేసేందుకు అర్హులైన వారు అక్టోబరు 8వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షుడు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ కోరారు. వీరికి ఎటువంటి జీతభత్యాలు, పారితోషికాలు, వేతనాలు ఉండవన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక కోర్టు సముదాయంలోని మండల న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి పశువైద్య కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలన్నీ పరిష్కరించడంతోపాటు రావాల్సిన నిధులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ అన్నారు. శనివారం కళాశాలలో ప్రధాన భవనం నిర్మాణం, పశుగణ క్షేత్రభవనం, వసతి గృహాలను సందర్శించారు. కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను, విద్యార్థి సంబంధ వ్యవహారాల అధికారిణి సుధారాణి, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎం.ఎం.నాయక్

వినియోగదారులకు మెరుగైన సేవలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోదారుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరు, వినియోగదారుల ఫోరం పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) టెక్నికల్ సభ్యుడు ఎస్.మాసిలామణి అన్నారు. శనివారం బొబ్బిలిలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఫిర్యాదులను వాట్సాప్, అంతర్జాలం తదితర మార్గాల్లో తెలియజేయొచ్చని చెప్పారు. దీనివల్ల మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? చినగాగల్లవలస ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉంది. వర్షం వస్తే కారిపోతోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

● నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. - భానుప్రకాష్, ఎంఈవో

– న్యూస్‌టుడే, గుర్ల

? చినమానాపురంలో చేపట్టిన సంపద తయారీ కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అందులోనే చెత్తాచెదారాలు పడేస్తున్నారు. - స్థానికులు

● కేంద్ర నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పల్లె ప్రగతికి బాటలు

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాజ్యాంగ బద్ధంగా పంచాయతీలకు రావాల్సిన నిధులను పక్కదారి పట్టించడంతో గ్రామాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా పల్లెల్లో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. – న్యూస్‌టుడే, గరివిడి



సిమెంటు రహదారి నిర్మాణానికి నోచుకోనున్న గరివిడి ఇందిరమ్మ కాలనీ వీధి

సభల్లో తీర్మానం

ప్రతి పంచాయతీలోనూ అధికారులు గ్రామసభలు నిర్వహించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. ఇప్పటి వరకు చెరువులు, కాలువలు అభివృద్ధి, పంట కాలువల్లో పూడిక తీత వంటి పనులే జరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను గుర్తించారు. అనుసంధాన మార్గాలు, సీసీ రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరా, ఉద్యాన పంటల సాగుతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు 40 విభాగాల్లో పనుల వివరాలు సేకరించారు.

అనుసంధానంతో..

చీపురుపల్లి నియోజకవర్గంలో 120 పంచాయతీలున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు వెళ్లకుండా స్థానికంగా పనులు కల్పించేందుకు కేంద్రం ఉపాధి హామీ పథకం ద్వారా ఏటా రూ.కోట్లు కేటాయిస్తోంది. ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు అనుసంధానం చేసి.. పల్లెల రూపురేఖలు మార్చి.. వేతనదారులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు డ్వామా, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా శాఖ ఇంజినీరింగు అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నియోజకవర్గంలో గుర్తించిన పనుల వివరాలిలా..

మండలం	పంచాయతీలు	పనుల సంఖ్య	ప్రతిపాదించిన నిధులు (రూ.కోట్లలో)
చీపురుపల్లి	19	2,816	113.81
గరివిడి	30	3,242	111.61
గుర్ల	42	3,611	99.20
మెరకముడిదాం	29	2,252	91.23
మొత్తం	120	11,921	415.85

ప్రాధాన్యత క్రమంలో..

గడిచిన అయిదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పనులు జాడలేకుండా పోయింది. వాటిని గుర్తించి.. ఉపాధి నిధులతో చేపట్టడం ద్వారా వేతనదారులకు ఉపాధి కల్పనతోపాటు పల్లెల ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామసభల్లో ప్రతిపాదించిన పనులన్నీ ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని అధికారులకు సూచించాం. – కిమిడి కళా వెంకట రావు, ఎమ్మెల్యే, చీపురుపల్లి

కాలువ శుభ్రం

స్పందనకు వందనం

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని సారధి ప్రాథమిక పాఠశాల పక్కన కాలువలో చెత్త నిల్వలతో దోమల బెడద అధికమైంది. స్థానికుల ఇబ్బందులపై ఈనెల 26న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలువను శుభ్రం చేశారు.

వీధి దీపాల ఏర్పాటు

రామభద్రపురం, న్యూస్‌టుడే: కొట్టక్కి వీధిలో సర్పంచి రవ్వా ఈశ్వరరావు, ఉప సర్పంచి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో కొత్త దీపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పాడైన దీపాలతో ఇబ్బందులపై ఈనెల 10న 'ఈనాడు'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే కొత్తవి అమర్చుతామని ఈవో సూరిబాబు అన్నారు.

మా పిల్లల టీసీలు ఇచ్చేయండి

బొబ్బిలి, న్యూస్‌టుడే: సీబీఎం బాలికోన్నత పాఠశాల వివాదం కొత్త మలుపు తిరిగింది. పాఠశాల గుర్తింపుతోపాటు బోధనా సిబ్బంది లేరని, పిల్లలను తీసుకెళ్లిపోతామని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం బడి వద్దకు చేరుకున్నారు. టీసీలు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయురాలు సునేత్రిని కోరారు. పిల్లల భవిష్యత్తు గందరగోళంగా మారిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సిబ్బంది లేరని, సోమవారం రావాలని ఆమె సూచించారు.



పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రధాన రహదారులు అంధకారం



చీపురుపల్లిలోని విజయనగరం - పాలకొండ, శ్రీకాకుళం ప్రధాన రహదారుల్లో పలుచోట్ల సెంటర్ లైటింగ్ స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగక అంధకారం అలముకుంటోంది. గత కొద్ది రోజుల క్రితం దీపాలు మరమ్మతులకు గురికావడంతో చీకటి పడితే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దొంగతనాలు జరిగే అవకాశముందని, మేజర్ పంచాయతీ అధికారులు అదిగో ఇదిగో అంటున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో వై.ఝాన్సీరాణి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. దీపాలు వెలిగించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి

పక్కా జాబితాకు సహకరించాలి

గజపతినగరం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల సవరణకు అధికారులు ఇంటింటి సర్వే చేపడుతున్నారని, రాజకీయ పక్షాల నేతలు సహకరించి.. తప్పులు లేని జాబితా తయారీకి కృషి చేయాలని నియోజకవర్గ ఓటర్ల జాబితాల నిర్వహణాధికారిణి, ఉప కలెక్టరు ప్రమీలా గాంధీ అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై, మాట్లాడారు. పూర్తిగా దస్త్రాలు సిద్ధం చేసిన తర్వాత ఓటర్ల తొలగింపు, లేదా చేర్పు చేస్తామన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాల్లో పేర్లు, లింగం, వయసు, ఇతర తప్పులు ఉంటే సరిచేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ఉప తహసీల్దారు సతీష్, తెదేపా, వైకాపా మండలాధ్యక్షులు లక్ష్మునాయుడు, బూడి వెంకటరావు, భాజపా, జనసేన, సీసీఎం, సీపీఐ తదితర పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ నేతలతో చర్చిస్తున్న ప్రమీలా గాంధీ

ప్రాయశ్చిత్త హోమం

చీపురుపల్లి, బొబ్బిలి, గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ శనివారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చీపురుపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, నాయకులు పూజలు నిర్వహించారు. ● హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడుకుందామంటూ హనుమాన్ భక్త బృందం, హిందూ ఉత్సవ సమితిలు సంయుక్తంగా బొబ్బిలి పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పురవీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. మన దేవాలయాలు-మన హక్కు అంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.



చీపురుపల్లిలో హోమం చేస్తున్న కూటమి నాయకులు

దారంతా ఆరబోత

బొబ్బిలి గ్రామీణం, తెర్లాం, న్యూస్‌టుడే: కమ్మవలసలో దారి పొడవునా మొక్కజొన్న పిక్కలు ఆరబోశారు. ఇటీవల వర్షాలకు కండిలు తడిసిపోవడంతో వాటి నుంచి తీసిన పిక్కలు రహదారులపై రైతులు ఆరబెట్టారు. తడిస్తే వ్యాపారులు కొనుగోలు చేయరని అంటున్నారు. ఇలా దారంతా ఆయబోయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. తెర్లాం మండలంలోని చుక్కవలస, వి.చిన్నయ్యపేట తదితర గ్రామ రహదారులపైనా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులకు అవగాహన కల్పిస్తామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.





చిన్నారుల ప్రదర్శన

బాలల కోలాటం భళా

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

జానపద కళల్లో ఒకటి కోలాటం. ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ కళకు బొబ్బిలి మండలం నారాయణప్పవలస పాఠశాల విద్యార్థులు ప్రాణం పోస్తున్నారు. జానపదం, భక్తి పాటలకు కర్రలతో లయబద్ధంగా శబ్దం చేస్తూ. . పాడుతూ అడుగులు వేస్తున్నారు. వీరి కోలాటం అందర్నీ ఆకట్టుకుంటోంది. వివిధ పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జిల్లా స్థాయిలో బహుమతులు అందుకున్నారు. వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. 7 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలే ఈ బృందంలో ఉన్నారు. బొబ్బిలికి చెందిన కళాకారుడు కరుణ కుమార్ వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బృందంలో గీతాంజలి, యోగీశ్వరి, నందిని, పార్వతి, కృష్ణవేణితోపాటు 22 మంది ఉన్నారు.

● ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రతిభా పోటీలు, వినాయక చవితి ఉత్సవాలు, జాతరలు, రాజకీయ నాయకుల కార్యక్రమాలు, వివిధ సందర్భాల్లో తమ కళను చూపి.. బహుమతులు, నగదు అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి జిల్లాలో కోలాటం అంటే నారాయణప్పవలస గ్రామం గుర్తు వచ్చేలా ప్రతిభ చూపారు. ఇటీవల శ్రీకాకుళం, విశాఖ నగరాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు సార్లు ప్రథమ బహుమతులు సాధించారు. నాలుగు దఫాలు ఉత్తరాంధ్ర జిల్లాల పోటీల్లో ప్రథమ అవార్డులు అందుకున్నారు.

ఆనందంగా ఉంది

రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. కోలాటం తెలుగు సాంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మ. మారుతున్న కాలానికి అనుగుణంగా చిత్రాలు, ఇతర నేపథ్య కార్యక్రమాలకు అలవాటు పడడంతో అంతరించిపోతోంది. మళ్లీ దీనికి గ్రామీణ ప్రాంతాల కళాకారులు జీవం పోస్తున్నారు.

– కరుణకుమార్, శిక్షకుడు



జ్ఞాపిక, చెక్కు అందుకున్న బాలికలు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

గజపతినగరం, రేగిడి, చీపురుపల్లి, రాజాం గ్రామీణం, దత్తిరాజేరు, గంట్యాడ గ్రామీణం, బొబ్బిలి గ్రామీణం, తెర్లాం, మెంటాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించి, సమాజంలో వారి గౌరవం మరింత పెరిగేలా చర్యలు తీసుకుందని గృహనిర్మాణ సంస్థ డీఈఈ సత్యనారాయణ అన్నారు. 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా గజపతినగరం, పురిటిపెంట గ్రామ సభల్లో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. రేగిడిలో ఎంపీడీవో శ్యామలాకుమారి లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించారు. ఉంగరాడ మెట్ట కాలనీలో ఇళ్లను పరిశీలించారు. చీపురుపల్లి-2 సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు మాట్లాడారు. రాజాం మండలం బొద్దాం గ్రామంలో ప్రత్యేకాధికారిణి నిర్మలాకుమారి అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలించి, మార్చి నాటికి పూర్తిచేయాలన్నారు. దత్తిరాజేరు మండలం ఎస్.చింతలవలసలో ప్రత్యేక అధికారి జోసెఫ్, గంట్యాడ మండలం సిరిపురం, నరవ గ్రామాల్లో తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి, బొబ్బిలి మండలం చింతాడలో ఏఈ సూర్యనారాయణ, ఎం.బూర్జివలసలో ఎంపీడీవో రవికుమార్, మెంటాడ మండలం చల్లపేట, పోరాం, కొండలింగాలవలస గ్రామాల్లో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తెర్లాంలోని జగనన్న కాలనీలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పర్యటించి సూచనలు చేశారు.



లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న సత్యనారాయణ

నేడు మెగా వైద్య శిబిరం

రాజాం, న్యూస్‌టుడే: తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధి ఆర్‌వీజే నాయుడు తెలిపారు. శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సేవలు అందిస్తారన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

తెర్లాం, న్యూస్‌టుడే: తమ పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులకు బోధన కష్టతరంగా మారిందని, వెంటనే నియమించాలని కోరుతూ విజయరాంపురం(బూరిపేట) సర్పంచి బి.మధుసూదనరావు ఎంఈవో జె.త్రినాథరావుకి వినతి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఈకేవైసీతో పథకాల వర్తింపు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే:. రైతులంతా ఈకేవైసీ నమోదు చేసుకోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. బుడతనాపల్లి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. అంతా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏవో శ్యాంకుమార్ తదితరులు ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

వంగర, న్యూస్‌టుడే: రాజులగుమ్మడ సమీపంలో నిల్వ ఉంచిన 1,500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

ఉద్యోగినితో అనుచిత ప్రవర్తన?

బొబ్బిలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఇన్‌స్పెక్టరుగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి.. మహిళా ఉద్యోగినితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో శనివారం బంధువులు ఆయనపై చేయిచేసుకున్నట్లు తెలిసింది. ఆ శాఖలో నాల్గో తరగతి ఉద్యోగిగా ఆమె ఎంపికయ్యారు. అయితే నియామక ఉత్తర్వుల కోసం ఆయన పదేపదే తిప్పుతున్నారని, శనివారం కార్యాలయానికి రమ్మని చేయిపట్టుకున్నాడని చెబుతున్నారు. దీనిపై ఇంతవరకు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ సతీష్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

నేరాల నియంత్రణకు చర్యలు

రాజాం, న్యూస్‌టుడే: నేరాలు పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఎస్.రాఘవులు సిబ్బందికి సూచించారు. శనివారం రాజాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి.. రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి సీఐ కె.అశోక్‌కుమార్ వివరించారు. రాజాం గ్రామీణ సీఐ హెచ్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

గరివిడి, రేగిడి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు చిత్తు చేసుకోవద్దని ఎస్ఐ లోకేశ్వరరావు అన్నారు. స్థానిక వేద కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని, వాహనాలను సురక్షితంగా నడపాలని ఎస్ఐ నీలావతి అన్నారు. రేగిడి మండలం ఉంగరాడలో ప్రజలకు అవగాహన కల్పించారు.

పనుల ప్రారంభానికి చర్యలు

రాజాం, సంతకవిటి, గజపతినగరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను గుర్తించాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు సూచించారు. రాజాం, సంతకవిటి మండల పరిషత్తు కార్యాలయాల్లో విడివిడిగా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అక్టోబరు 2 నుంచి గ్రామాల్లో పనులు గుర్తించే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవోలు వి.శ్రీనివాసరావు, జీవీ రవికుమార్, ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు. ఉపాధిహామీ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని గజపతినగరం క్లస్టర్ ఏపీడీ జనార్దనరావు సిబ్బందితో అన్నారు. వ్యవసాయ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎస్.జగన్‌మోహనరావు

సంతకవిటి, న్యూస్‌టుడే: అధికారుల తీరుపై మండల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ ఎస్.మంజు అధ్యక్షతన, ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొండగూడేం, అప్పలఅగ్రహారం, కాకరాపల్లి సర్పంచులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల పరిశీలనలో ఆ సంస్థ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై శ్రీకాకుళం జడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించడం తగదని, నిబంధనల ప్రకారం మాత్రమే పనులు చేయాలన్నారు. తాగునీరు, రెవెన్యూ, వ్యవసాయ తదితర శాఖలపై సమీక్షించారు. తహసీల్దారు టి.కల్యాణచక్రవర్తి, ఏవో నవీన్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: పిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం చైతన్య టెక్నో పాఠశాలలో పది రోజులుగా జరుగుతున్న క్రీడా మీట్ ముగింపు వేడుకల్లో పాల్గొని, మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు తదితర క్రీడల్లో రాణించిన వారిని అభినందించారు. సీఐ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ కె.మురళీధర్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న సిబ్బంది

ఫిర్యాదుపై డీపీఎం విచారణ



ఐసీఆర్పీలను విచారిస్తున్న ఆనందరావు

మెంటాడ, న్యూస్‌టుడే: జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై శనివారం ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఆనందరావు జి.టి.పేటలో విచారణ చేపట్టారు. రాజకీయ దురుద్దేశంతో తమను ఐసీఆర్పీ విధుల నుంచి తొలగించారంటూ జి.టి.పేట, పిట్టాడకు చెందిన కృష్ణ, అచ్చింనాయుడు, గణేష్‌లు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జి.టి.పేటతోపాటు పలు గ్రామాలకు చెందిన ఉద్యోగులను పరిస్థితిపై విచారించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని డీపీఎం చెప్పారు.

అపరిచితుల్ని నమ్మొద్దు

గంట్యాడ, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మోసాలు ఎక్కువ అవుతాయని, అంతర్జాలంలో అపరిచితుల మాటలు నమ్మొద్దని ఐసీడీఎస్ సీడీపీవో డి.ఉమాభారతి అన్నారు. సఖి కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా విద్యార్థులకు సైబర్ మోసాలపై అమరావతి నుంచి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. చరవాణి, కంప్యూటర్లను అవసరం మేరకు వినియోగించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.జ్యోతి, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, పద్మ, మహిళా పోలీసు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీవోల బదిలీ

విజయనగరం పట్టణం: మెప్మా హెచ్ ఆర్ సిబ్బందికి బదిలీలు జరిగినట్లు ఇన్‌ఛార్జి పీడీ కె.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరంలో పని చేస్తున్న సీవోలు ఎం.అరుణజ్యోతి, పి.సింహాచలంను బొబ్బిలికి బదిలీ చేశారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

ఆర్డీవోగా దాట్ల కీర్తి బాధ్యతల స్వీకరణ



విజయనగరం అర్బన్, పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం రెవెన్యూ డివిజన్ అధికారిణిగా దాట్ల కీర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీఎంఆర్డీఏలో కార్యదర్శిగా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. గతంలో ఆమె జిల్లాలో బీసీ సంక్షేమాధికారి, సమగ్ర శిక్షా ఇన్‌ఛార్జి ఏపీసీగా పనిచేశారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ● నగర పాలక సంస్థ సహాయ సిటీ ప్లానరుగా రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు.

విజయనగరంలో త్వరలో మరో అన్న క్యాంటీన్



ఘోషాసుపత్రి వద్ద అన్నక్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనరు నల్లనయ్య

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలో త్వరలో మరో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహారం అందించడమే తమ ఉద్దేశమని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. శనివారం ఘోషాసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే రెండు అన్న క్యాంటీన్‌లు ప్రారంభించామని తెలిపారు. ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈఈ రామసుబ్బారావు, ఏఈలు పాల్గొన్నారు.

సిరుల తల్లికి.. జన నీరాజనం

పైడితల్లి ఉత్సవాల్లో భాగంగా పెదతాడివాడలో గుర్తించిన ఇరుసు, సిరిమాను వృక్షాలు శనివారం రాత్రి నగరంలోని హుకుంపేట పూజారి గృహానికి చేరుకున్నాయి. దారిపొడవునా మహిళలు పసుపు, కుంకుమలతో ఎదురొచ్చి సిరిమానుకు పూజలు చేశారు. రైల్వేస్టేషన్ వనంగుడి వద్ద భక్తులు పెద్ద ఎత్తున చేరటంతో ప్రాంగణం సందడి నెలకొంది. సిరిమాను వెంట పులివేషాలు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్



సిరిమాను వృక్షం కోసం పసుపు నీళ్ల బిందెలతో మహిళలు



పూజిస్తున్న బొత్స ఝాన్సీ



చెట్టు యజమానులు అప్పారావు దంపతులు



చెట్టుకు గొడ్డలితో వేరుచేస్తున్న ఎమ్మెల్యే మాధవి. చిత్రంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, ఎమ్మెల్యే అదితి



కోలాటం ప్రదర్శనలో మహిళలు



పులి వేషాలు..



మానుకు మొక్కుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

వినికిడి సమస్య పిల్లలతో ఆటా-పాట



ఆసుపత్రి ప్రాంగణంలో పిల్లలతో నిర్వాహకులు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే సందర్భంగా వినికిడి సమస్యతో బాధపడుతున్న పిల్లలకు శనివారం ఘోష ఆసుపత్రి ప్రాంగణంలో డీఈఐసీ విభాగంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన డీఈఐసీ కార్యవర్గ సిబ్బంది, ముఖ్యంగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.అనూష, ఆడియోలజిస్టు, స్పీచ్ థెరపిస్టు ఎం.రత్నం పాల్గొని వినికిడి, మాటలు లోపం కలిగిన పిల్లలకు ఉద్దేశించి అవగాహన లోపాలు తెలియజేశారు. వినికిడి లోపం ఉంటే వారికి పరికరం అమర్చి, స్పీచ్ థెరపీ ఇప్పిస్తే మాట్లాడగలరని వైద్యురాలు అనూష వివరించారు.

జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్

విజయనగరం న్యాయవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయస్థాన ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టు ఆవరణను శుభ్రం చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

మార్చిలోగా నిర్మాణాలు పూర్తిచేయండి



నెల్లిమర్ల, ఎస్.కోట, న్యూస్‌టుడే: జరజాపుపేట ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చిలో పూర్తి చేయాలని జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ కూర్మినాయుడు లబ్ధిదారులను కోరారు. శనివారం విజయనగరంలో బాధ్యతలు స్వీకరించి అనంతరం జరజాపుపేటలో ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. పునాదుల స్థాయిలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. వైస్‌ఛైర్మన్ రామారావు, ఈఈ శ్రీనివాస్, డీఈ మురళీమోహన్, ఏఈ పవన్ చైతన్య పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి టీకా వేయాలి

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ప్రతి చిన్నారికి టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి అచ్యుతకుమారి అన్నారు. శనివారం మండలంలోని కోనాడ, తిప్పలవలసల్లో నిర్వహించిన టీకా వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. దస్త్రాలు చూసి మాట్లాడారు. తీర ప్రాంతాల్లో పిల్లలందరికీ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంద శాతం వేసేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రత్నకుమారి, ఉమాపతి, ఆర్.వి.రమణ, బంగారమ్మ, సంధ్య పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న అచ్యుతకుమారి

గుండె బాగుంటేనే ఆరోగ్యం



విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: మనం ప్రాణాలతో జీవించాలంటే గుండె పదిలంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం కోట నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. మేయర్ విజయలక్ష్మి, ఆసుపత్రి ఎండీ కె.తిరుమల ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

వినాయకునికి 108 వంటకాలతో సారె

ఎల్.కోటలో ఆర్య, వైశ్య సంఘం, వాసవీ కన్యకాపరమేశ్వరీ సంఘాల ఆధ్వర్యంలో వినాయకునికి పెద్ద ఎత్తున మిఠాయిల సారె శనివారం అందజేశారు. మొత్తం 108 రకాల వంటకాలను తయారుచేసి ఉదయం మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి వినాయకునికి నైవేద్యం పెట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం వేల మందికి మహాన్నదానం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో విగ్రహాన్ని రథంపై ఊరేగించి కోనేరులో ఘనంగా నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట



ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పూసపాటిరేగ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. . కొప్పెర్ల గ్రామానికి చెందిన లంకలపల్లి దుర్గారావు(32) సమీపంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. భార్య శ్యామల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నారు. ఒక్కసారిగా తనలో తానే మాట్లాడుకుని మళ్లీ యథాస్థితికి వస్తుంటారు. మనస్తాపానికి గురైన అతను శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో అంతా నిద్రపోయిన సమయంలో పంకాకు ఉరేసుకున్నారు. ఉదయాన్నే చూసిన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్ద దిక్కు కోల్పోయామంటూ రోదిస్తున్న తీరు అందర్నీ కలచివేసింది.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ఎస్.కోట, నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామంలో భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పోలిపల్లి సూరి, తవిటినాయుడు, లెంక రాజారావు, రెడ్డి అబద్ధం, ఆదినారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ కేశవరావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రూ.కోట్లు పోశారు.. కన్నెత్తి చూడరేం?

• నగరంలో చెరువుల అభివృద్ధి అంతంతే
• రూ.9.69 కోట్లు నిధులు ఏమైనట్లో..

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నగర ప్రజలకు వాడుక, ఇతర అవసరాలు తీర్చడమే కాకుండా.. ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువులు అక్రమార్కుల చేతుల్లో చిక్కిశల్యమవుతున్నాయి. ఉన్న వాటి అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించినా.. కనీస సదుపాయాలూ కానరావడం లేదు. వ్యర్థాలు, చెత్త చెరువుల్లో చేరుతుండడంతో మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఆధునికీకరణ, పచ్చదనం ఏమైందో దేవుడికే తెలియాలి.





పెద్దచెరువులో చేరిన వ్యర్థాలు

నగరపాలక సంస్థ పరిధిలో రికార్డుల ప్రకారం 88 వరకు చెరువులు ఉండాల్సి ఉన్నా.. వాటిలో చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రస్తుతం ఉన్న వాటిని పరిరక్షించుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదు చెరువుల అభివృద్ధికి 14వ ఆర్థిక సంఘం, అమృత్ 2.0, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) ద్వారా మొత్తం రూ.9.69 కోట్లు వెచ్చించారు. పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు.

ఈ ఐదింటి పరిస్థితి అంతే..

పెద్దచెరువు 166 ఎకరాల్లో విస్తరించిన ప్పటికీ 12 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు అధికారులే చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో దీని చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. నిర్వహణ లేక దారి పొడవునా పిచ్చిమొక్కలు మొలిచాయి. చెరువు చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రవేశ మార్గాల గేట్లు విరిగిపోయాయి. దీంతో కొందరు బహిర్భూమిగా ఉపయోగిస్తున్నారు. ● జమ్ముదారిలో కోమటి చెరువు వ్యర్థాల గుట్టలతో కనిపిస్తోంది. దీని పరిసరాల్లో మొక్కలు నాటి, లైటింగ్ సదుపాయం కల్పించారు. సదుపాయాలు కల్పించలేదు. చుట్టూ బురదమయంగా మారింది. ● నీలాటి చెరువు చుట్టూ నడక మార్గం ఏర్పాటు చేశారు. మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి వాడిపోయి, మార్గం అధ్వానంగా తయారైంది. ● అయ్యకోనేరు గట్టు చుట్టూ ఉన్న ఇళ్ల డ్రైనేజీ, మురుగు దొడ్ల గొట్టాలు కోనేరులోనికి కలిపారు. ● బుచ్చెన్నకోనురులో వ్యర్థాల కుప్పలు పోస్తున్నారు. ఇటీవల గేటు, బోర్డు ఏర్పాటు చేసినా నిర్వహణ లేక పాడయ్యాయి.

నిధులేమైనట్టు..

ఐదు చెరువులకు 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.5.59 కోట్లు ఖర్చు చేశారు. పెద్దచెరువుకు రూ.1.60 కోట్లు, అయ్యకోనేరుకు రూ.1.26 కోట్లు, బుచ్చెన్న కోనేరుకు రూ.50 లక్షలు, కోమటి బందకు రూ.1.18 కోట్లు, నీలాటి చెరువుకు రూ.కోటి ఖర్చు చేసినా అభివృద్ధి లేదు.

అమృత్ ఏమైంది..

కేంద్రం అమృత్ 2.0 కింద ఎకరా విస్తీర్ణం గల వాటిలో ఈ ఐదు గుర్తించి రూ.4.10 కోట్లు మంజూరు చేసింది. కోమటి చెరువుకు రూ.కోటి, అయ్యకోనేరుకు రూ.80 లక్షలు, పెద్ద చెరువుకు రూ.85 లక్షలు, నీలాటి చెరువుకు రూ.80 లక్షలు, బుచ్చెన్న కోనేరుకు రూ.65 లక్షలు కేటాయించారు.

విజిలెన్స్ విచారణ జరుగుతోంది

ఐదు చెరువులకు సంబంధించి అమృత్ 2.0 నిధులతో ఏపీజీబీసీ పనులు పూర్తిచేసి అప్పగించిన విషయం నా దృష్టికి రాలేదు. వీటిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.

– పి.నల్లనయ్య, కమిషనరు, విజయనగరం

సీఎం సహాయనిధి సాయం అందజేత

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పుత్సల వీధికి చెందిన కొల్లి పార్వతికి సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.1.15 లక్షల చెక్కును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అందజేశారు. ఇటీవల ప్రమాదానికి గురైన ఆమెకు రెండు కాళ్లు విరిగిపోవడంతో స్థానికులు, బంధువుల సాయంతో శస్త్రచికిత్స చేసుకున్నారని తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు



ప్రధానాచార్యుడికి చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్, ఎస్.కోట, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం తోటపాలెం ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రూ.50 వేల ఆర్థికసాయాన్ని డీడీ రూపంలో శనివారం ప్రధానాచార్యుడు సీహెచ్.కృష్ణంనాయుడికి అందజేశారు. దాతలు అందించిన విరాళాల మొత్తం రూ.25 వేల చెక్కును ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్‌కు శనివారం అందజేశారు.

దంత వైద్య శిబిరం

కొత్తవలస: ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి సహకారంతో శనివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి 60 మందికి పైగా శిబిరానికి వచ్చి దంతాలు తనిఖీ చేయించుకున్నారని నిర్వాహకులు జనసేన మండల అధ్యక్షుడు గొరపల్లి రవికుమార్, చినబాబు తెలిపారు. తెదేపా నాయకులు రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

నేను అనగా కంటుభుక్త బాలకృష్ణరావు, తండ్రి స్వర్గీయ వెంకటరమణారావు, వయస్సు: 77 సం।।లు, ఇ.నెం.: 7-13-14/2, పార్కు గేటు జంక్షన్ దగ్గర, శివాలయం వీధి, విజయనగరం వారు నిరారించి తెలియజేయడమేమనగా, నేను అసలు సెటిల్‌మెంట్ డీడ్ పత్రాలు నెం. 3653/1961, 3654/1961, మరియు రిజిష్టర్ వీలు పత్రం సం. 67/1961లను నేను నా పాత ఇంటినుంచి కొత్తపేట వైపు వెళ్తుండగా దారిలో పోయినవి మరియు ఎన్ని ప్రయత్నాలు చేసినా దొరకలేదు. మరియు పొందలేదు. ఇవి నా నాన్నమ్మగారైన స్వర్గీయ కంటుభుక్త అప్పలనరసమ్మ గారికి చెందినవి. నేను మరలా తెలియజేయడమేమనగా ఋణాలు మరియు ఇతర విషయాలకు, ఏ బ్యాంకులకు గాని లేదా ఆర్థిక సంస్థలకు గాని లేదా కొందరు మూడవ వ్యక్తులకు గాని పైన వివరించిన సేల్‌డీడ్ పత్రాలను తనఖా పెట్టడం గాని నేను చేయలేదు. పై పత్రాలకు సంబంధించి సదరు ఆస్తి వారసులతో న్యాయస్థానంలో పెండింగులో ఏలాంటి కేసులు లేవు. నేను పై పత్రాలను దుర్వినియోగం చేసినట్లుగా అధికారులు కనుగొన్నచో, సదరు అధికార్లు తీసుకొనే ఏ చర్యలకైనా నేను బాధ్యుడగుదును. నేను ఇంకా తెలుపడమేమనగా పత్రాలలో తెల్పిన ఆస్తులకు సంబంధించి ఏలాంటి సివిల్ తగాదాలు లేవు. అందువల్ల పైన తెల్పినట్టి పోయిన పత్రాలను కనుగొనవల్సినదిగా అధికారులను కోరడమైనది.

పైన వివరించిన విషయాలు నిజమైనవనీ మరియు సత్యాలనీ మరియు అసలు విషయాలను ముభ్యపరచడం మరియు తప్పు ప్రాతినిధ్యం వహించడం వంటి చర్యలు నేను చేయలేదని తెలియజేయడమైనది. ఒకవేళ భవిష్యత్తులో దొరికినచో, పైన వివరించిన దానిలో నేను ఏ విధమైన తప్పుడు ప్రాతినిధ్యం చేసినట్లుగా రుజువైనచో సదరు అధికారులు నాపై ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చునని తెలియజేయడమైనది. ఇట్లు

కె. బాలకృష్ణరావు S/o లేటు వెంకటరమణారావు
H. No: 7-13-14/2, పార్కు గేటు జంక్షన్ దగ్గర, శివాలయం వీధి, విజయనగరం. సెల్: 7093370001

ఉద్యమ కార్యాచరణ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణను యూటీఎఫ్ రూపొందించింది. శనివారం సాయంత్రం డీఈవో ఎన్.ప్రేమకుమార్‌కు యూటీఎఫ్ నాయకులు దీనిపై నోటీసును అందజేశారు. ఇందులో పోరాట కార్యక్రమాల వివరాలను పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఆర్‌సీ పట్నాయక్, ఈశ్వరరావు, కార్యదర్శులు ఎన్.సత్యనారాయణ, తిరుపతినాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలు కావాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగ సృష్టికర్తలు కావాలని జేఎన్‌టీయూ గురజాడ ఇంజినీరింగ్ కళాశాల ఉప ప్రధానాచార్యులు జి.జె.నాగరాజు కోరారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పరిచయ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, సత్య విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

సంక్షిప్త సమాచారం

9.700 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

కొత్తవలస, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం అలెప్పుజ జిల్లా పుతిన్‌పురయిల్‌కు చెందిన ఇద్దర్ని గంజాయి తరలిస్తుండగా పోలీసులు శనివారం పట్టుకుని అరెస్టు చేశారు. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం. .ఆర్టీసీ సముదాయం వద్ద అనుమానాస్పదంగా ఉన్న విను మోహన్, ప్రసన్న జయన్ ఐశ్వర్యను తనిఖీలు చేయగా, వారి వద్ద ఆరు ప్యాకెట్లలో 9.700 కిలోల గంజాయి ఉంది. సీజ్‌చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఎస్.కోట: అరకు వైపు నుంచి రెండు కిలోల గంజాయితో వస్తున్న ఇద్దరిని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద శనివారం పట్టుకున్నట్లు సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు. ఎస్ఐ భాస్కరరావు వాహన తనిఖీలు చేస్తుండగా తమిళనాడుకు చెందిన శివకుమార్, మణికందన్‌లు గంజాయితో పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడిన దెందేరు గ్రామానికి చెందిన విరోతు కృష్ణ(47) విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఏఎస్సై జనార్దనరావు కేసు నమోదు చేశారు. మంచంపై నుంచి ఇటీవల పడిపోయి గాయపడటంతో ఆసుపత్రిలో చేర్చారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

ఎస్.కోట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడంటూ ఓ బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణానికి చెందిన జి.హేమంత్‌పై పోక్సో కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ వి.నారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 24న విజయనగరం ఎస్సీ, ఎస్టీ విభాగం డీఎస్పీ వీరకుమార్ కేసు నమోదు చేశారన్నారు.

ఈపీడీసీఎల్‌లో అధికారుల బదిలీలు, చేరికలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్స్ సర్కిల్‌లో పలువురు అధికారులకు బదిలీ అయినట్లు ఎస్ఈ ఎం.లక్ష్మణరావు వెల్లడించారు. ఈఈ టెక్నికల్‌గా పి.మురళీకృష్ణ శనివారం బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ● పీవోగా పనిచేస్తున్న శ్రీనివాసం పార్వతీపురానికి బదిలీ కాగా కార్పొరేట్ ఆఫీసులో డీజీఎంగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను నియమించారు. ● ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ ఫణికిరణ్‌కుమార్‌ను పార్వతీపురం ఎంఆర్‌టీ ఈఈగా, విజయనగరం ఎంఅండ్‌పీ ఈఈ సత్యనారాయణను ఈఈ ఎంఆర్‌టీగా, కమర్షియల్, టెక్నికల్ డీఈఈ మాధవనాయుడును పార్వతీపురానికి, డీఈఈ కన్‌స్ట్రక్షన్స్ కె.బాలాజీని పార్వతీపురం డీఈఈ ఎల్టీఎం, ఎస్పీఎంగా బదిలీ చేశారు. ● డీఈఈ సీటీఎం తిరుపతిరావును డీఈఈ హెచ్‌టీసీటీఎంగా స్థానచలనమైంది. ● బొబ్బిలి డీఈఈ కన్‌స్ట్రక్షన్స్ ఎం.లక్ష్మినారాయణను పార్వతీపురానికి, నెల్లిమర్ల డీఈఈ టీఆర్ఈ ఎల్.సత్యనారాయణ విజయనగరం ఎల్టీఎం డీఈఈగా బదిలీ అయ్యారు. ● డీఈఈ కె.జంగమేశ్వరరావును హెచ్‌టీసీటీఎం డీఈఈగా నియమించారు. ● ఎంఅండ్‌పీ డీఈఈ కె.ప్రసాదరావును టీఆర్ఈ అండ్ ప్రొటెక్షన్‌కు నియమించారు.

మెప్మాలో సీవోలకు..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: మెప్మా హెచ్ ఆర్ సిబ్బందికి బదిలీలు జరిగినట్లు ఇన్‌ఛార్జి పీడీ కె.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. విజయనగరం సీవో దాలినాయుడుకు నెల్లిమర్ల, సీవోలు హేమాంబరరావును సాలూరు, ఎస్ ప్రశాంతికుమారిని పార్వతీపురం, జి.సుజాతకు సాలూరు, ఈశ్వరరావు పార్వతీపురం, ఎం.అరుణజ్యోతి, పి.సింహాచలంలను బొబ్బిలి, ఎ.సత్యంను నెల్లిమర్లకు బదిలీ చేశారు. ఖాళీ స్థానంలో సత్యం నియమితులయ్యారు.

వాణిజ్య పన్నుల శాఖలో..

వాణిజ్య పన్నుల శాఖలో ప్రబంధకుడుగా పనిచేస్తున్న వై.మన్మథరావును విశాఖ ద్వారకానగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో విశాఖ డాబాగార్డెన్స్ సర్కిల్ నుంచి సీహెచ్ నాగమల్లేశ్వరిని నియమించారు.

వంద శాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో వంద శాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యంగా ముందుకు రావాలని కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. శనివారం గృహలబ్ధిదారులతో స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ● అనధికార కట్టడాలు, ఆక్రమణలను ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య హెచ్చరించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష చేశారు.

కరాటే విజేతలకు అభినందనలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ఏబీ ఛారిటబుల్ ట్రస్టు, తదితర స్పోర్ట్సు అకాడమీల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులు కరాటే పోటీల్లో పతకాలు సొంతం చేసుకున్నారు. క్రీడా విజేతలకు శనివారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు చేతుల మీదుగా పతకాలు అందజేశారు.



విజేతలతో కేసలి అప్పారావు తదితరులు

బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



కొత్తవలస, ఎస్.కోట, జామి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల బాస్కెట్ బాల్ అండర్-14, 17 బాలబాలికల జట్లను మండలంలోని ఓపీ జిందాల్ భారతి పాఠశాల ఆవరణలో శనివారం ఎంపిక చేశారు. దీనికి రెండు జిల్లాల నుంచి 170 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 48 మంది (రెండు విభాగాల్లో బాలికలు 24 మంది, బాలురు 24 మంది)ని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ దారగంగమ్మ & శివాలయం, పుణ్యగిరి (గ్రా), ఎస్.కోట (మం), విజయనగరం జిల్లా

టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. నిల్/2024 తే 28.09.2024ది

విజయనగరం జిల్లా, యస్.కోట మండలం, పుణ్యగిరి గ్రామంలో గల శ్రీ దారగంగమ్మ & శివాలయంనకు యొక్క కార్తిక మాసం ఉత్సవములు 2024 సందర్భముగా ఈ దిగువ పేర్కొనబడిన మిసిలేనియస్ వేలములు యొక్క లైసెన్స్‌ను టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలో కౌలుకు ఇచ్చుటకు గాను తేది: 09.10.2024 ఉదయం గం 11:00ల నుండి సదరు శ్రీ దారగంగమ్మ అమ్మవారి ఆలయం వద్ద టెండర్-కమ్-బహిరంగ వేలం పాటలు నిర్వహించుటకుగాను నిర్ణయించడమైనది. కావున ఆసక్తి గల వ్యక్తులు ఈ దిగువ పేర్కొబడిన టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలలో పాల్గొనవచ్చును.

వ.నెం	లైసెన్స్ వివరములు	ప్రథమ ధరావత్తు రూ.	లైసెన్స్ కాలం
1	పుణ్యగిరిలో స్వామివారికి భక్తులు విడిచి వెళ్ళిన కొబ్బరి కాయలలో సగభాగం (కొబ్బరి ముక్కలు) జమచేసుకునే హక్కు లైసెన్స్	రూ. 20,000/-	తే 03-11-2024ది నుండి తే 02-12-2024ది వరకు
2	పుణ్యగిరిలో పండు ఫలిజి (పూజాసామగ్రి) అమ్ముకునే హక్కు లైసెన్స్	రూ. 30,000/-	తే 03-11-2024ది నుండి తే 02-12-2024ది వరకు
3	పుణ్యగిరిలో స్వామివారి ఫోటోలు మరియు ప్రమిద, దీపాలు అమ్ముకునే హక్కు లైసెన్స్	రూ. 20,000/-	తే 03-11-2024ది నుండి తే 02-12-2024ది వరకు

"కావున ఆసక్తి గల వ్యక్తులు పాటలో పాల్గొనవచ్చును.పాటలో పాల్గొను వ్యక్తులు మిగిలిన వేలము పాట షరతులను కార్యాలయమును పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును. 1. సదరు వేలం పాట డిపార్టుమెంటు వారి ఉత్తర్వులకు లోబడి ఉండును. 2. సదరు ఆలయమునకు ఏవిధమైన బకాయిలు వున్నవారు గాని, ఎట్టి లావాదేవీలు ఉన్నవారు గాని, పాటలో పాల్గొనరాదు. 3. టెండర్ ద్వారా పాల్గొను వ్యక్తి ఏదైనా జాతీయము చేయబడిన బ్యాంకు నందు కార్యనిర్వాహణాధికారి శ్రీ దారగంగమ్మ & శివాలయం, పుణ్యగిరి గ్రామం, యస్.కోట మండలం, పేరున ప్రథమ ధరావత్తుగా పేర్కొనిన మొత్తంను డిమాండ్ డ్రాఫ్టుతీసి టెండర్ ఫారంతో తేదీ: 09.10.2024ది ఉదయం గం. 11:00ల లోపుగా నేరుగా గాని లేదా పోస్టల్ ద్వారా గాని కార్యాలయమునకు అందునట్లు పంపవచ్చును లేదా సదరు ఆలయము వద్ద ఏర్పాటుచేయబడిన టెండర్ బాక్సునందు వేయవచ్చును. 4. పాటలో పాల్గొనదలచిన వ్యక్తిగాని, లేదా టెండర్ దారుడు గాని హిందు మతస్తుడై యుండవలెను. 5. పాట ముగిసిన పిమ్మట హెచ్చుపాట దారుడు లేదా టెండర్ దారుడు హెచ్చు పాటసొమ్మును దేవస్థానమునకు ముందుగా చెల్లించు నిర్ణయం 6. మిగిలిన వేలము పాట షరతులను కార్యాలయమును పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

కార్యనిర్వాహణాధికారి, శివాలయం
లేఖ.నెం.నిల్/2024 తే:28-09-2024 ది

శ్రీ దారగంగమ్మ & పుణ్యగిరి గ్రామం
కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం